సాక్షి
నిజామాబాద్
సోమవారం । 17 । జూన్ । 2024



ఎడారిలా ఎస్సారెస్పీ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరువలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



బహిరంగంగా తాగేస్తున్నారు

మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /25.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ శాఖ ప్రజావాణి

నిజామాబాద్ నాగారం : విద్యుత్ సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, ఏడీఈ, డివిజినల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఏమైనా సమస్యలుంటే వినియోగదారులు, రైతులు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోమవారం సెలవు రోజైనా ప్రజావాణి ఉంటుందన్నారు.

జీపీ కార్యదర్శిపై వేటు

సుభాష్‌నగర్: డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) పంచాయతీ కార్యదర్శి రాజలింగంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. రాజలింగం గతంలో గాంధారి మండలం బూర్గుల్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించాడు. ఆ సమయంలో ఫోర్జరీ సంతకాలతో చెక్కు డ్రా చేసి నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ అనంతరం రాజలింగంను సస్పెండ్ చేశారు.

నేడు బక్రీద్

నిజామాబాద్ అర్బన్ : ముస్లింలు పవిత్రంగా భావించే బక్రీద్ పండుగను సోమవారం జరుపుకోనున్నారు. ఈ పండుగ సందర్భంగా ముస్లింలు పేదవారికి దానధర్మలు చేస్తారు. నమాజ్ తర్వాత మేకలు బలి ఇచ్చి విందులు చేసుకుంటారు.

ముస్లింలకు కలెక్టర్ బక్రీద్ శుభాకాంక్షలు



సుభాష్‌నగర్: ముస్లిములకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం ఓ ప్రకటనలో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరుకున్నారు. దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమైన ప్రజలు సోమవారం బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి



నిజామాబాద్‌అర్బన్ : నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం శ్రీ శ్రీ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మేయర్ నీతూ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలుగు కవిత్వానికి కొత్త దారులు వేసిన మహా కవి శ్రీశ్రీ అన్నారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ.. శ్రీశ్రీ తెలుగు కవిత్వాన్ని నడిపించారన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కామారెడ్డి కలెక్టర్



కామారెడ్డి క్రైం: కామారెడ్డి నూతన కలెక్టర్‌గా నియమితులైన ఆశిష్ సంగ్వాన్ ఆదివారం జిల్లా కేంద్రానికి విచ్చేశారు. కలెక్టరేట్ వద్ద ఆయనకు అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో నూతన కలెక్టర్ పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన అదనపు కలెక్టర్లతో సమావేశమయ్యారు. జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాలపై చర్చించారు. ధరణి, ధాన్యం సేకరణ, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి తదితర కార్యక్రమాల పురోగతిని తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో రంగనాథరావు, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ఎస్సీ అభివృద్ధి అధికారి రంజిత, డీఈవో రాజు, డీపీఆర్వో శాంతి కుమార్, తహసీల్దార్ జనార్దన్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



జిల్లాలో వానాకాలం సాగు వివరాలు (ఎకరాల్లో..)

పంట	వరి	మొక్కజొన్న	సోయాబీన్	పత్తి	పసుపు	కంది	పెసర	మినుము	వేరుశనగ
అంచనా	4,30,550	41,909	51,478	3,273	19,606	1,444	123	185	178
సాగైంది	12,455	10,356	1,110	05	6,859	00	00	00	00

కరుణించని వరుణుడు

- మృగశిర కార్తె ప్రారంభమై వారం గడిచినా పత్తాలేని వానలు
- ముందస్తుగా సాగు చేసిన పంటలు ఎండుముఖం
- ఆకాశం వైపు చూస్తున్న అన్నదాతలు

వర్షాకాలం ప్రారంభమైనా జిల్లాలో ఒక్క భారీ వర్షం కూడా పడలేదు. వరుణుడు కరుణించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఆశలతో పంటల సాగుకు సిద్ధమైన అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు.



బోదేపల్లిలో విత్తిన పంటకు నీరు అందిస్తున్న రైతు

బాల్కొండ/డొంకేశ్వర్ : నైరుతి రుతుపవనాల రాకతో భారీ వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. జిల్లాలో రుతుపవనాలు విస్తరించినా భారీ వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. పుడమి తల్లి పులకించేలా వర్షం కురువకపోవడంతో పంటలు వేసేందుకు రైతులు ఆలోచిస్తున్నారు. భూగర్భ జలాలు ఉన్న రైతులు కొందరు ముందస్తుగా పంట సాగు చేశారు. వర్షాలు పడితే పంటలకు ఇబ్బంది ఉండదనుకున్న వారికి నిరాశే మిగిలింది. మృగశిర కార్తె ప్రారంభం రోజు స్వల్ప వర్షం కురువడంతో ప్రస్తుత సంవత్సరం సకాలంలో వర్షాలు కురుస్తాయని రైతులు ఆశించారు. కానీ వారి ఆశలు అడియాసలు అయ్యాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 4.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు అందులో సగం మేర కూడా నారుమడులు పోయలేదు. గతేడాది మృగశిర కార్తె నుంచే వర్షాలు కురవడంతో దాదాపుగా జూన్ మధ్య వరకు ఆరు తడి పంటలను విత్తడం పూర్తయింది. కానీ ప్రస్తుత సంవత్సరం వరుణుడి కరుణ లేక పోవడంతో జూన్ నెల మధ్యలోకి వచ్చిన పంటలు విత్తుట సగం కూడా కాలేదు.

ఎత్తిపోతున్న బోర్లు

ఆర్మూర్ డివిజన్‌లో బోరుబావుల ఆధారంగా కొంత మంది రైతులు ముందస్తుగా రోహిణి కార్తె ప్రారంభం నుంచే పంటలు విత్తడం ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో బోరు బావులు ఎత్తిపోతున్నాయి. ఉన్న నీటికి వర్షాలు తోడు అయితే పంటలు మొలకెత్తుతాయని రైతులు ఆశించారు. కానీ అన్నదాతలకు ఆదిలో హంస పాదు అన్నట్లుగా మారింది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ భానుడి ప్రతాపం తగ్గక పోవడంతో నాటిన విత్తనాలు కూడా మొలకెత్తడం లేదు. కొందరు రైతులు పసుపు పంటను కూడా విత్తారు. ప్రస్తుతం వానలు లేకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. పసుపు పంట విత్తనం మార్కెట్‌లో లభించే అవకాశం లేదు. ఒక్కసారి విత్తితే మళ్లీ పంట దిగుబడి వచ్చిన తర్వాతే విత్తనం లభిస్తుంది. వర్షాలు లేకపోవడంతో పూర్తి స్థాయిలో మొలకెత్తే అవకాశం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

మేఘాలు కమ్ముకుంటున్నా..

జిల్లాలో వారం రోజులుగా ఉరుములు, మెరుపులు ఆశలు రేకెత్తిస్తున్నాయి. రోజూ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. అప్పటికప్పుడు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం వస్తుందే మోనన్న పరిస్థితి ఏర్పడుతుంది. అయితే అంతలోనే గాలులు వీస్తుండడంతో మేఘాలు తేలిపోతున్నాయి. రోజూ ఇదే పరిస్థితి ఉంటోంది. వర్షాలు కురుస్తాయని రైతులు ఆకాశంవైపు చూడడం, అంతలోనే మేఘాలు మాయమవుతుండడంతో నిరాశ చెందుతున్నారు.

పసుపు వేశా..



బోరుబావుల్లో నీరు ఉండటం, వానలు పడుతాయని ఆశతో పసుపు పంటను విత్తాను. ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో నీరు సరిపోవడం లేదు. విత్తిన పంట పూర్తిగా మొలకెత్తుతుందో లేదోనని ఆందోళనగా ఉంది.

– దేవేందర్, వన్నెల్(బి), రైతు

ఏటా ఇదే దుస్థితి



వానాకాలం ప్రారంభమైన వానలు పడటం లేదు. ఏటా ఇదే పరిస్థితి ఉండటంతో సకాలంలో విత్తనాలు విత్తలేక పోతున్నాం. ఇప్పటివరకు పసుపు పంట విత్తడం పూర్తి కావాలి. కానీ వానలు లేక నిత్యం మొగులు వైపు చూస్తున్నాం.

– ఎల్లారెడ్డి, రైతు, నాగంపేట్

పదోన్నతుల్లో అయోమయం!

- సీనియారిటీ జాబితాలో నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి పేర్లు
- గత పదోన్నతుల జాబితా లేకపోవడమే కారణం
- డిక్లరేషన్ తీసుకుంటున్న విద్యాశాఖ

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖలో పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాలో మళ్లీ తప్పులు వెలుగులోకి వచ్చాయి. గతంలో పదోన్నతి తిరస్కరించిన కొందరు టీచర్ల పేర్లు మళ్లీ సీనియారిటీ జాబితాలో ఉన్నాయి. జూనియర్‌లు వారిని ఒప్పుకోవడం లేదు. జిల్లా విద్యాశాఖ వద్ద పదోన్నతుల సీనియారిటీ జాబితాలు అందుబాటులో లేవు. దీనిని ఆసరాగా చేసుకొని అక్రమాలకు తెర లేపారు. కొందరు జిల్లా విద్యాశాఖ అధికారులు సీనియారిటీ జాబితాను రూపొందించడంలో తప్పులు చేయడంతో పాటు సరైన ఆధారాలు లేకపోవడం కూడా ఈ వ్యవహారానికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు.

రెండు సార్లు తిరస్కరిస్తే అనర్హులు

ఎస్జీటీలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదోన్నతి కల్పించాల్సి ఉంది. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు శుక్రవారం రాత్రి సీనియారిటీ జాబితా రూపొందించారు. ఈ జాబితాలో అనేక సార్లు పదోన్నతి లభించిన తిరస్కరించిన వారి పేర్లు కూడా ఉన్నాయి. నిబంధనల ప్రకారం రెండు సార్లు నాటు విల్లింగ్ ఇచ్చిన వారు పదోన్నతులకు అనర్హులు. కానీ రెండు నుంచి నాలుగు సార్లు నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి పేర్లు సీనియారిటీ జాబితాలోకి వచ్చాయి. 8 మంది ఎస్జీటీలు 2009, 2011, 2013, 2015లో నాట్ విల్లింగ్ ఇచ్చారు. వీరి పేర్లు సైతం ప్రస్తుత జాబితాలో ఉన్నాయి. నవీపేట మండలంలో పని చేసే ఓ పీఆర్‌టీయూ 2015 పదోన్నతుల సమయంలో ప్రమోషన్‌ను తిరస్కరించాడు. కానీ ప్రస్తుతం పదోన్నతి జాబితాలో ఉన్నారు. ఆయన గతంలో ఎన్నడూ నాట్ విల్లింగ్ ఇవ్వలేదని డీఈవోకు డిక్లరేషన్ ఇవ్వడం గమనార్హం. పెర్కిట్, రూద్రూర్‌కు చెందిన ఓ సంఘం నాయకులు సైతం ఉన్నారు. నాట్ విల్లింగ్ పేరిట మరో 25 మందిని అధికారులు తొలగించారు. గత పదోన్నతుల సమయంలోని సీనియారిటీ జాబితా, నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి వివరాలు విద్యాశాఖలో అందుబాటులో లేవు. దీంతో ఈ సమస్య వచ్చింది.

వైదొలగాలని ఆదేశం

పదోన్నతుల జాబితాలో ఉన్న టీచర్లను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ కార్యాలయానికి పిలిపించి సమావేశం నిర్వహించారు. ఎవరైనా రెండుసార్లు నాట్ విల్లింగ్ ఇస్తే ఖచ్చితంగా జాబితా నుంచి వైదొగాలని ఆదేశించారు. దీంతో సుమారు 18 మంది నాట్ విల్లింగ్ ఇచ్చామని జాబితా నుంచి వైదొలిగారు. కానీ మరి కొందరు నాట్ విల్లింగ్ ఇచ్చినా కూడా నిబంధనకు విరుద్ధంగా సీనియారిటీ జాబితాలో కొనసాగుతున్నారు. వీరిని గుర్తించడంలో విద్యాశాఖ ఆందోళన చెందుతుంది. ఒకవేళ వీరిని తొలగిస్తే కోర్టుకు వేళ్తే ఇబ్బందులు తలత్తే అవకాశం ఉంది. ఖచ్చితంగా తొలగించాలంటే గతంలో రూపొందించిన లిస్టు లేకపోవడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు.

డిక్లరేషన్ తీసుకుంటున్నాం

సీనియారిటీ జాబితాలో గతంలో నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి పేర్లు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో విచారణ చేపట్టి కొందరిని తొలగించాం. ఆధారాలు లేకపోవడంతో మిగతా వారిని గుర్తించడం కష్టంగా మారింది. స్వయంగా వారు జాబితా నుంచి తప్పుకోవాలి. పదోన్నతి తీసుకున్న తర్వాత తెలిస్తే చర్యలు తీసుకుంటాం. దాని కోసమే ఉపాధ్యాయుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నాం.

– దుర్గాప్రసాద్, డీఈవో



ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులు(ఫైల్)

ఫారెస్ట్ అధికారులపై దాడి కేసులో ఎనిమిది మంది రిమాండ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కాల్పోల్‌లో రెండు రోజుల క్రితం ఫారెస్ట్ అధికారులపై దాడి చేసిన కేసులో గ్రామానికి చెందిన ఎనిమిది మందిని ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపారు. కాల్పోల్ గ్రామశివారులో అటవీ భూమి చదును చేస్తున్నారన్న సమాచారం మేరకు సౌత్ ఎఫ్ఆర్‌వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, బీట్ ఆఫీసర్ ప్రగత్‌కుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది అక్కడికి చేరుకోగా వారిపై దాడి చేశారు. దాడికి పాల్పడిన 30 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు మోతీలాల్, జీవన్‌సింగ్, రతీయ, గణేష్, నాగరాజు, బలరాం, హీరాలాల్, జగదీశ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ కేసులో ఎవరినీ వదిలిపెట్టేది లేదని, దాడికి పాల్పడిన, ప్రేరేపించిన, హస్తమున్న వారందరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఆయన స్పష్టంచేశారు.

సైజ్ ఏదైనా చెల్లించేది ఒకే రేటు!

- గిట్టుబాటు కాని కూలి
- స్కూల్ యూనిఫామ్ కుట్టడంపై మహిళల్లో అసంతృప్తి



యూనిఫాంలు కుడుతున్న మహిళలు

ఎల్లారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ ఓ కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. గ్రామీణ మహిళలకు ఆర్థిక తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో యూనిఫామ్‌లు కుట్టే పనిని ప్రభుత్వం వారికి అప్పగించింది. అయితే, ఏ తరగతి విద్యార్థి డ్రెస్ కుట్టినా ఒకే కూలి చెల్లిస్తామనడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో డ్రెస్‌కు రూ.50 చెల్లిస్తామని తొలుత ప్రకటించిన ప్రభుత్వం.. ఆ తరువాత మరో రూ.25 అదనంగా చెల్లించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అయినప్పటికీ కూలి సరిపోవడం లేదని మహిళలు అంటున్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫామ్‌లను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా సిద్ధం చేయించేది. ప్రైవేట్ ఏజెన్సీల నిర్లక్ష్యం కారణంగా పాఠశాలలు ప్రారంభమైన రెండు నెలలకు గాని యూనిఫామ్‌లు అందేవి కావు. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది నుంచి మహిళా సంఘాల ద్వారా యూనిఫామ్‌లు కుట్టించాలని నిర్ణయించింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలు దాదాపు 1,000 ఉండగా, వీటిలో 86,611 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ప్రతి విద్యార్థికి రెండేసి చొప్పున 1,73,222 అందజేయాలనే ఉద్దేశంతో యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతను ఐకేపీ ద్వారా జిల్లా వ్యాప్తంగా 128 ఐకేపీ కుట్టు ఏజెన్సీలకు బాధ్యతను అప్పగించారు. ఒక్కో డ్రెస్‌కు రూ.50 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం తెలుపగా, మొదట్లో యూనిఫామ్‌ల తయారీకి మహిళలు ఆసక్తి కనబర్చినా పని మొదలైన తరువాత వెనుకంజ వేస్తున్నారు. కటింగ్ మాస్టర్‌కు రూ.5, గుండీలు, దారాలు, కాజాలకు మరో రూ.15 వరకు ఖర్చు అవుతోంది. డ్రెస్‌ల తయారీకి ముడి బట్టను తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (తెలంగాణ స్టేట్ హ్యాండ్‌లూమ్ సొసైటీ) ద్వారా మండల ఐకేపీ కార్యాలయాలకు చేరుతున్నది. వచ్చిన బట్టల తాన్లను దించుకోవడానికి లేబర్ చార్జీలు, మండల కార్యాలయాల నుంచి కుట్టు సెంటర్ల వరకు తీసుకువెళ్లేందుకు అయ్యే రవాణ ఖర్చులను కూడా మహిళా సంఘాలే భరించుకోవాల్సి రావడంతో.. ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.50లో నుంచి సగానికి పైగా మొత్తం ఖర్చులకే పోతోంది. దీంతో, రోజంతా కష్టపడినా కనీసం రూ.250 కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంత చిన్న డ్రెస్ కుట్టేందుకైనా రూ. 250 నుంచి రూ. 300 వరకు కూలి తీసుకుంటున్నారని అంటున్నారు.

సిద్ధమైంది 60 శాతమే..

పాఠశాలల పునః ప్రారంభం నాటికి జిల్లా వ్యాప్తంగా కేవలం 60 శాతం మాత్రమే డ్రెస్‌లు సిద్ధమైనట్లు సమాచారం. ఖాదీ కార్పొరేషన్ నుంచి జిల్లాకు ముడి బట్టలు మే నెల మొదటి వారంలో రావాల్సి ఉండగా.. 29వ తేదీ వరకు అందినట్లు ఐకేపీ అధికారులు తెలిపారు. బట్టను ఆయా మండలాలకు పంపిణీ చేసేందుకు మరో రెండుమూడు రోజులు పట్టిందని వారు అంటున్నారు. అయినప్పటికీ మహిళలు పగలూరాత్రి కష్టపడుతూ డ్రెస్‌లు సిద్ధం చేస్తున్నారని ఐకేపీ అధికారులు పేర్కొంటున్నారు.

స్థానిక సమరం ఎప్పుడో?

- వచ్చే నెల 4తో ముగియనున్న మండల, జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధుల పదవీ కాలం
- ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన




ఏర్గట్ల మండల పరిషత్ కార్యాలయం

మోర్తాడ్ : స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఆశావహులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఇప్పటికే ముగిసిపోగా, జూలై 4తో మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవీ కాలం తీరిపోనుంది. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నికల తంతును ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేయాల్సి ఉన్నా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, అంతలోనే పార్లమెంట్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువడటం ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం పట్టింది. పంచాయతీలకు గడచిన జనవరిలోనే ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అలాగే మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు కూడా ఇప్పటికే ఎన్నికలను నిర్వహించి ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్‌ల పదవీ కాలం ముగిసిపోగానే వారి స్థానంలో కొత్త ప్రజాప్రతినిధులకు బాధ్యతలను అప్పగించాల్సి ఉంది. కులగణన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడం ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత రిజర్వేషన్లలో మార్పులు చేయాలని యోచిస్తోంది. ఈ లెక్కన స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాగే అవకాశం కనిపించడం లేదు.

జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. 2019 స్థానిక సంస్థల లెక్కల ప్రకారం జిల్లాలో 299 ఎంపీటీసీ, 25 జెడ్పీటీసీ స్థానాల పదవీ కాలం ముగిసిపోనుంది. కొత్తగా మండలాల పునర్విభజన జరగడంతో జెడ్పీటీసీ స్థానాల సంఖ్య పెరగనుంది. అలాగే ఎంపీటీసీ స్థానాల సంఖ్యను పెంచుతారా లేదా అనే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎంపీపీ, జెడ్పీ చైర్మన్‌ల పదవీ కాలం ముగిసేలోపు ఎన్నికలను నిర్వహించకపోతే మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు కూడా ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం కనిపిస్తుంది.


ఎన్నికలను నిర్వహించాలి



స్థానిక సంస్థలకు షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలను నిర్వహించాలి. ప్రత్యేకాధికారుల పాలనతో ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు టైం ప్రకారం ఎన్నికలను నిర్వహించినట్లు స్థానిక సంస్థలకు సమయానుగుణంగానే ఎన్నికల తంతు పూర్తి చేయాలి.

– మామిడాల మనోహర్, మోర్తాడ్

నిర్లక్ష్యం తగదు



చట్టసభలకు ఒకలాగా, స్థానిక సంస్థలకు మరోలా ఎన్నికల తంతును నిర్వహించడం సరికాదు. స్థానిక సంస్థల ఎన్నికలు అంటేనే నిర్లక్ష్యం కనిపిస్తుంది. ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమన్వయం చేసుకుని స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించాలి.

– వినీత్‌కుమార్‌గౌడ్, మోర్తాడ్

వ్యవసాయ బావిలో కొండగొర్రె



భీమ్‌గల్: మండలంలోని బడా భీమ్‌గల్‌కి చెందిన శ్రీనివాస్ అనే రైతు వ్యవసాయక్షేత్రంలోని బావిలో కొండగొర్రె ప్రమాదవశాత్తు పడింది. గమనించిన సదరు రైతు బావిలోకి దిగి దానిని బయటకు తీశాడు. కొండ గొర్రెను ఇంటికి తీసుకువచ్చి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి దేవీదాస్ బడా భీమ్‌ల్‌కు చేరుకొని కొండ గొర్రెను స్వాధీనం చేసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం కొండ గొర్రెను అడవిలో వదిలి పెడతామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పురస్కారం అందడం గర్వకారణం


రమేశ్ కార్తీక్‌నాయక్

బోధన్: గిరిజన జీవిత గాథలపై రచనలు రాసి కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారానికి తమ పాఠశాల పూర్వ విద్యార్థి రమేశ్ కార్తీక్‌నాయక్ ఎంపిక కావడం గర్వంగా ఉందని విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆదివారం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. 2021లో రమేశ్ తెలుగులో రాసిన 'ఢావ్లో' (విషాద గీతం) రచన కేంద్ర సాహిత్య పురస్కారానికి ఎంపికైంది.

సాయిబాబా ఆలయ హుండీ ధ్వంసం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్ సమీపంలో ఉన్న సాయిబాబా ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. ఆలయం రెండో ద్వారం తలుపులకు వేసిన తాళాన్ని పగులగొట్టి ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లారు. పది రోజుల క్రితం ఆలయంలో రూ. 25 వేలు విలువ చేసే ఆంప్లిఫ్లేయర్‌ను దుండగులు ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

బక్రీద్ పండుగకు ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలోని ఖిల్లా, బోధన్ బస్టాండ్, ఫులాంగ్ ప్రాంతాల్లో ఉన్న ఈద్గాల్లో ముస్లిములు ప్రార్థనలు చేయనున్నడంతో మంగళవార ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు ట్రాఫిక్ దారి మళ్లింపులు ఉన్నట్లు సీపీ కల్మేశ్వర్ ఆదివారం పేర్కొన్నారు. బోధన్ వైపు వెళ్లేవారు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శివాజీ చౌక్, గంజ్, నిజాం కాలనీ మీదుగా అర్సపల్లి నుంచి బోధన్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్లేవారు మాధవనగర్ బైపాస్ నుంచి కంఠేశ్వర్ బైపాస్, న్యూ కలెక్టరేట్ ద్వారా అర్సపల్లి మీదుగా బోధన్‌కు వెళ్లాల్సి ఉంది. బోధన్ నుంచి నిజామాబాద్‌కు వచ్చేవారు అర్సపల్లి సర్కిల్ నుంచి న్యూకలెక్టరేట్ మీదుగా కంఠేశ్వర్ బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్‌కు రావాల్సి ఉంటుందన్నారు. ప్రజలు గమనించి విధినిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



ఎడపల్లి: మండలంలోని జానకంపేట్ గ్రామానికి చెందిన అర్సపల్లి లక్ష్మి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు రూ. లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో భర్త శంకర్ ఆవేదనకు గురవుతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేదని దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించాలని శంకర్ కోరుతున్నారు. 944100 6782 నంబర్‌కు జీ-పేకు ఆర్థికసాయం అందించాలని కోరారు.

కొయ్యగుట్టలో కారు ప్రమాదం



బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్ట సమీపంలోని ప్రధాన రహదారిపై హైదరాబాద్ నుంచి వర్ని వెళ్తున్న ఓ కారు చెదలవాగు వంతెన వద్ద ఆదివారం సాయంత్రం ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

ఎడారిలా ఎస్సారెస్పీ

- నీరు లేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ
- కురవని వర్షం.. కనిపించని వరద
- ఇబ్బందుల్లో ఆయకట్టు రైతులు


ఎస్సారెస్పీలో కనుచూపు మేరలో కనిపించని నీరు

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వర ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీరు లేక ఎడారిని తలపిస్తోంది. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 7.82 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు భారీ వరదలు వచ్చి చేరలేదు. దీనికి తోడు గోదావరి పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కూడా కురవక పోవడంతో ఎస్సారెస్పీ ఎడారిని తలపిస్తోంది. గతేడాది జూన్‌లో భారీ వరదలు ప్రారంభమయ్యాయి. జూలై వరకు ప్రాజెక్ట్‌లో 70 టీఎంసీల నీరు చేరింది. దీంతో ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా నీటి విడుదల చేపట్టారు. కానీ ప్రస్తుత సంవత్సరం ఎగువ ప్రాంతాల్లో కురిసిన చిన్నపాటి వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగానే వరద వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి 1447 క్యూసెక్కులు మాత్రమే వరద వస్తోంది. ప్రస్తుత ఏడాది ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందనే నివేదిక కూడా వచ్చింది. 90 టీఎంసీల నుంచి 80 టీ ఎంసీలకు నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పోయింది. ప్రాజెక్ట్ నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువలోనే ఉండటంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

'మహా' ప్రాజెక్టులు ఖాళీ..

ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ, విష్ణుపురి ప్రాజెక్టులకు కూడ నీరు లేక వెలవెలబోతున్నాయి. బాబ్లీ గేట్లు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం జూలై 1న ఎత్తాలి. కానీ బాబ్లీ ప్రాజెక్ట్‌లో నీరులేక పోవడంతో గేట్లు ఎత్తినా నీరు వచ్చే అవకాశం లేదు. ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతంలోని విష్ణుపురి ప్రాజెక్ట్ నుంచే ప్రధాన వరద వచ్చి చేరుతుంది. ఆ ప్రాజెక్ట్‌లో ఆశించినంత నీరు లేదని అధికారులు తెలుపుతున్నారు. గతేడాది ఓ మోస్తారు వర్షాలు జూన్‌లో వచ్చి చేరాయి.

కాళేశ్వరం నీరు వచ్చేనా..

ఎస్సారెస్పీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం రూ. 1067 కోట్ల నిధులతో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పనులను ప్రారంభించింది. జూలై మొదటి వారంలో ఎస్సారెస్పీకి కాళేశ్వరం నీరు గతేడాది 25 టీఎంసీలు జూలై మాసంలో తరలించారు. తర్వాత కాళేశ్వరం నీటిపై ఊసే లేదు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిస్థితి గందరగోళంగా ఉండటంతో ఆ నీరు ఎస్సారెస్పీకి వచ్చేనా అంటు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈసారి ఆలస్యమేనా..

ప్రాజెక్ట్‌లోకి దశాబ్ద కాలంగా చూస్తే 2016, 2018లో సమయానికి వరద వచ్చి చేరింది. 2016లో ఏకంగా జూలై వరకు ప్రాజెక్ట్ నిండుకుండల మారి వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలారు. 2018లో ముందస్తుగా వరదలు వచ్చి నిలిచి పోయాయి. దీంతో ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరలేదు. 2022లో సకాలంలో వరదలు వచ్చాయి. 2023లో జూలైలో ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. మిగతా సంవత్సరాల్లో ఎప్పుడూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే వరదలు వచ్చి చేరాయి. దీంతో ఖరీఫ్‌కు నీటి విడుదల చేపట్టకుండా ముందస్తుగా రబీకి నీటి విడుదల చేపట్టారు. ప్రస్తుత ఏడాది కూడా ఆలస్యంగా వరదలు వచ్చి చేరితే ఖరీఫ్‌పై ఆశలు ఆవిరవుతాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిసి ప్రాజెక్ట్ నిండుకుండల మారాలని వేడుకుంటున్నారు.

నూత్‌పల్లిలో చారిత్రక గడి


ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో పాతూరు నూత్‌పల్లి వద్ద గడి ముఖద్వారం


పోలీస్ పటేల్ నర్సింహారెడ్డి కుటుంబీకులు గడీలో నివాసమున్నప్పటి చిత్రం

డొంకేశ్వర్: మండలంలోని నూత్‌పల్లి పాతూరు గడి కోటకు చరిత్రాత్మక చరిత్ర ఉంది. ఈ పురాతన కోటను రాజులు పరిపాలించారని చరిత్రకారులు చెబుతున్నారు. రాజులు ఇక్కడి నుంచి వెళ్తూ గడీని పోలీస్‌పటేల్‌గా ఉన్న తమ తాతగారైన పొద్దుటూరి నర్సింహారెడ్డికి అప్పగించినట్లు ఆయన మనువడు రాంచందర్‌రెడ్డి వెల్లడించారు. గడీని అప్పగించిన తర్వాత ఇక్కడ ఇళ్లు నిర్మించుకొని నివాసమున్నట్లు ఆయన చెప్పారు. ఐతే, ఎత్తయిన ఈ గడీని చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చేవారు. 1982లో ఎస్సారెస్పీ ప్రాజెక్టును నిర్మించడంతో పాత నూత్‌పల్లి గ్రామంతో పాటు కోట కూడా ముంపునకు గురైంది. ప్రస్తుతం ప్రతీ వర్షాకాలంలో గడీ కొంతమేర ముంపునకు గుర్రై ఎండాకాలంలో తేలుతుంది. ఇప్పుడు గడీ చుట్టూ చెట్లు, చెలము పెరిగి నిర్మానుష ప్రాంతంగా మారింది.

ముఖద్వారం కోట గట్టిదనం..

సుమారు 400 ఏళ్ల క్రితం నిర్మించిన గడీ కోట ముఖద్వారం ఇప్పటికీ గట్టిదనంతో కనిపిస్తోంది. ఎత్తయిన ముఖద్వారం బురుజును పెద్దరాతి బండలు, పొడవైన ఇటుకలతో నిర్మించారు. అగంతకులు కోటలోకి చొరబడకుండా చుట్టూ ప్రహారి ఉండేది. అది ప్రస్తుతం కూలిపోయింది. కాగా నలుదిక్కులా నూతులు(బావులు) కూడా ఉన్నాయి. కోటకు కాపాలాదారులు ఉండేవారు. కోటలోనే మైసమ్మ గుడి కూడా ఉంది. దొంగలను బంధించడానికి కోటలో రాతితో కట్టిన 'కొటేరు' ఉంది. కోట నుంచి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు సొరంగం కూడా ఉంది. ఇవన్నీ చూసిన పోలీస్ పటేల్ మనువళ్లు రాంచందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబం ప్రస్తుతం జిల్లా కేంద్రంలో నివాసం ఉంది. నాటి కాలంలో గడీలో గడిపిన క్షణాలను రాంచందర్ 'సాక్షి'తో పంచుకున్నారు.

బహిరంగంగా తాగేస్తున్నారు..!

- ఉమ్మడి బాల్కొండలో విచ్చల విడిగా మద్యం సేవిస్తున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


బోదేపల్లి శివారులో కాలువ కట్టపై తాగి పడేసిన బీరు సీసాలు

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండలంలో బహిరంగంగానే మందుబాబులు మద్యం సేవిస్తుండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్న పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. బాల్కొండ మండల శివారులో ఉన్న మల్లన్న గుట్ట సమీపంలో, బోదేపల్లి శివారులోని వేంపల్లి ఎత్తిపోతల కాలువపై, ముప్కాల్ మండల శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో, మండలంలోని రెంజర్ల శివారులోని లక్ష్మి మైనర్ కాలువ పక్కన, మెండోరా మండల పరిధిలో కాకతీయ కాలువ పక్కన ఉన్న పోచంపాడ్ హెలిప్యాడ్ ప్రాంతంలో నిత్యం అనేక మంది మందు బాబులు బీరు సీసాలతో దర్శనమిస్తున్నారు. ఇంతలా జరుగుతున్నా పోలీసులు నివారణ చర్యలు చేపట్టడం లేదు.

సీసాలు పగుల గొడుతు..

బహిరంగ ప్రదేశాల్లో పంట భూముల పక్కన మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను పగుల గొట్టి పంట భూముల్లో వేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పొలం భూముల్లో వేయడంతో రైతులు నీరు పెట్టి దమ్ము చేసే సమయంలో కాళ్లకు కుచ్చుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్లపైనే పగుల గొడుతున్నారు. దీంతో రోడ్ల వెంబడి వెళ్లేవారు ఆ ప్రాంతాల్లో వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో విచ్చల విడిగా మద్యం సేవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


రవిబాబు మృతదేహం

బాల్కొండ: కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొడిగవర్ రవిబాబు(22) మంగళి వృత్తి చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఉదయం గడ్డిమందు తాగగా గమనించిన కుటుంబీకులు ఆర్మూర్‌లోని ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

రైలుకు ఎదురెళ్లి..

ఖలీల్‌వాడి: వ్యక్తిగత కారణలతో ఒకరు రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నగరంలోని పోచమ్మగల్లీకి చెందిన గైని సురేశ్(39) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 3 గంటల ప్రాంతంలో కాచిగూడ నుంచి జైపూర్ వెళ్తున్న లాల్‌గాడి ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ..

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని దావల్‌మల్కపల్లికి చెందిన మమ్మాయి సిద్ధవ్వ(48) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్ధవ్వకు ఆరు నెలల క్రితం ప్రమాదంలో కాలు విరిగింది. నాటి నుంచి నొప్పితో బాధపడుతోంది. ఈ నెల 13న కాలు నొప్పి తాళలేక ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిపల్లిలో..


మల్లేశ్(ఫైల్)

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన ధరణి మల్లేశ్(29) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సంపత్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లేశ్ తండ్రి నర్సింలు గతేడాది మృతి చెందాడు. నాటి నుంచి తండ్రి మృతితో దిగులుగా ఉండేవాడు. తరచూ తండ్రిని గుర్తుకు చేసుకుంటు, సమాధి వద్దకు వెళ్లి బాధపడేవాడని గ్రామస్తులు తెలిపారు. దీంతో తండ్రి లేడనే మనస్థాపంతో గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించి కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఒకరి రిమాండ్

మోపాల్: మండలంలోని కంజర్‌లో గాజ గోవర్ధన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ ఆదివారం తెలిపారు. గోవర్ధన్‌కు అదే గ్రామా నికి చెందిన వర్షతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గోవర్ధన్ నిత్యం మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. ఈక్రమంలో వర్ష గతనెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. వర్ష మృతికి కారణమైన గోవర్ధన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఈ నెల 15న అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ ఆదివారం పేర్కొన్నారు. ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తిర్మలాపూర్‌లో..

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన కుకుట్ల రాములు ఈ నెల 4న అదృశ్యమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్యానికి బానిసైన రాములు ఈ నెల 4న హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని తిరిగి రాలేదని కుటుంబీకులు తెలిపారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సైబర్ మోసం.. రూ. 23 వేలు మాయం


ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడివిలింగాల గ్రామానికి చెందిన గుడిపల్లి సంఘమేశ్వర్‌రెడ్డి ఖాతా నుంచి రూ. 23 వేల నగదును సైబర్ నేరస్తులు డ్రా చేసినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సంఘమేశ్వర్‌రెడ్డి వాట్సప్‌నకు యూనియన్ బ్యాంక్ ఏపీకే ఫైల్ అనే లింకు రావడంతో దానిని ఓపెన్ చేయడంతో కొద్ది సేపటికి అతని ఖాతాలోంచి రూ. 23 వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఎల్లారెడ్డి పీఎస్‌తో పాటు సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించనట్లు పేర్కొన్నారు. అతని నగదు హోల్డ్ అయినట్లు ఎస్సై తెలిపారు. ప్రజలు ఫోన్లకు, వాట్సప్‌లకు గుర్తు తెలియని లింకులు వస్తే ఓపెన్ చేయొద్దని సూచించారు.

తప్పిపోయిన బాలిక ఆచూకీ లభ్యం


చిన్నారి షేక్ మహీర

భీమ్‌గల్: తప్పి పోయిన బాలిక షేక్ మహీర ఆచూకీ లభ్యమైనట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన చిన్నారి షేక్ మహీర భీమ్‌గల్‌లో ఉంటున్న తన తాత అమీర్ ఖాన్ ఇంటికి వచ్చింది. మతిస్థిమితం సరిగా లేని చిన్నారి షేక్ మహీర శనివారం ఉదయం ఆడుకుంటూ బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. తల్లితండ్రులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెతుకుతుండగా పట్టణంలోని రాథం చెరువు పరిసర ప్రాంతంలో గుర్రపు డెక్కలో చిక్కుకొని కనిపించింది. పోలీసులు చిన్నారిని బయటకు తీసి కుటుంబీకులకు అప్పగించారు.

పోయిన నగదు అందజేత



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ఏటీఎం వద్ద పోయిన నగదును పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితుడికి అప్పగించిన ఘటన ఒకటో టౌన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మణ్ ఒకటో టౌన్ పరిధిలో ఉన్న ఏటీఎంలో డిపాజిట్ మిషన్ వద్ద రూ. 2 లక్షల నగదు బ్యాగును మరిచిపోయి వెళ్లిపోయాడు. తిరిగి వచ్చే సరికి క్యాష్ బ్యాగ్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఓ వ్యక్తి తీసుకెళ్లినట్లు గుర్తించి అతని నుంచి నగదును స్వాధీనం చేసుకొని బాధితుడు లక్ష్మణ్‌కు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

'అపూర్వ' సమ్మేళనం


బోధన్‌లో సమ్మేళనంలో పాల్గొన్న బీటీనగర్ విద్యార్థులు


సమ్మేళనంలో శ్రీవిజయ సాయి కళాశాల విద్యార్థులు


దోమకొండలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు

బోధన్/ పెర్కిట్/ నాగిరెడ్డిపేట/ సిరికొండ/ దోమకొండ/ మాక్లూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలు చోట్ల ప్రభుత్వ పాఠశాల, ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం చేపట్టారు. బోధన్ పట్టణంలోని బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1986–87కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని కొత్త రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం చేపట్టారు. మూడున్నర దశాబ్దాల తర్వాత అందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–01కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సత్కరించారు. గోవిందపేట్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97కు చెందిన పదో తరగతి విద్యార్థులు, నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ హైస్కూల్‌లో 2005–06కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. బోధన్ శ్రీవిజయ సాయి జూనియర్ కళాశాలలో 2005–07లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, కళాశాల డైరెక్టర్ కామశాస్త్రిలను ఘనంగా సన్మానించారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు సుదర్శనం రాజయ్యను పూర్వ విద్యార్థులు సన్మానించారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లిలో గతంలో రాజయ్య ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అక్కడి 2005–06 చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించగా, అనారోగ్యంతో హాజరు కాని ఉపాధ్యాయుడిని దోమకొండలో సన్మానించారు. మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం చేపట్టారు. గురువులను సన్మానించారు. సమ్మేళనాల్లో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.


ఫత్తేపూర్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


గోవింద్‌పేట్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ముగిసిన యజ్ఞం



నిజామాబాద్ రూరల్: సారాంగాపూర్ గ్రామంలో గల రామ్ ప్రియదాస్ ఆశ్రమంలో పదకొండు రోజుల పాటు నిర్వహించిన యజ్ఞం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా అయోధ్య నుంచి సాధువులు పెద్ద సంఖ్యలో యజ్ఞకార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతులు శాస్త్రి మహరాజ్, మంగళ్‌దాస్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.